ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.80 (308.4658)	68,211	47,035
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.84 (3.65)	961.10	512.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.42 (37.54)	నిల్	12,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200



సీతారాంపురంలో పిచ్చి చెట్లతో నిండిన దేవాదుల కాల్వ

ముందుకు సాగని కాల్వల నిర్మాణం

సాగునీటి వనరుల్లేని గుండాల మండలానికి నీటి వనరులను కల్పించే ఉద్దేశ్యంతో 15 ఏళ్ల కిందట చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు కాల్వల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. కోర్టు కేసులు, భూసేకరణలో నిర్లక్ష్యంతో నిర్మాణంలో ముందడుగు పడటంలేదు. కాల్వలను అసంపూర్తిగా నిర్మించడం, నిర్మించిన చోట నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. త్వరగా కాల్వలు పూర్తి చేసి గోదావరి జలాలను అందించాలని అయకట్టు రైతులు కోరుతున్నారు.

- గుండాల

- 15 ఏళ్లుగా అసంపూర్తిగా దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు పనులు
- గుండాల మండలానికి సాగునీరెప్పటికో?
- 95 ఎకరాల్లో భూసేకరణ అసంపూర్తి
- కోర్టు కేసులతో కాల్వ పనుల్లో వెనకడుగు

ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గుండాల, తుంగతుర్తి ప్రాంతాలకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేసేందుకు 2009లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నవాబ్‌పేట వద్ద రిజర్వాయర్‌ను(దేవాదుల ప్రాజెక్టు) నిర్మాణాన్ని చేపట్టింది. 850 ఎకరాల్లో 0.445 టీఎంసీల నీటి సామర్థ్యంతో నవాబ్‌పేటలో రిజర్వాయర్‌తో పాటు కాల్వల నిర్మాణానికి రూ.260.77 కోట్లు కేటాయించారు. ఈ రిజర్వాయర్ కింద మొత్తం ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలోని 53,400 ఎకరాలను స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత యాదాద్రిభువనగిరి జిల్లాలోని గుండాల మండలంలోని 29 వేల ఎకరాలు, ప్రస్తుత జనగాం జిల్లాలోని దేవరుప్పుల మండలంలో 13,220 ఎకరాలు, లింగాల ఘణపురం మండలంలో 11వేల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలంలోని 180ఎకరాలకు సాగు నీరు అందించాలని నిర్దేశించారు.

రెండు పర్యాయాలు శంకుస్థాపనలు

సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2009లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య, 2017లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తన్నీరు హరీశ్‌రావులు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అయితే నవాబ్‌పేట నుంచి జనగాం జిల్లాలోని చివరి గ్రామమైన బూర్జుబాయి వరకు అక్కడి నుంచి గుండాల మండలంలోని కొమ్మాయిపల్లి వరకు కాల్వల నిర్మాణం పూర్తయ్యింది.

అసంపూర్తికాల్వలు దరిచేరని నీరు

గుండాల మండలంలోని కొమ్మాయిపల్లి నుంచి వెల్మజాల, అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, సీతారాంపురం, రామారం, మాసాన్‌పల్లి, మరిపడిగ, గుండాల, పాచిల్ల, గంగాపురం, అంబాల, వంగాల, నూనెగూడెం, తుర్కలషాపురం, పెద్దపడిశాల, వస్తాకొండరు మీదుగా బండకొత్తపల్లి వరకు సుమారు 28 కిలోమీటర్ల మేర కాల్వలు నిర్మించాల్సి ఉంది. ఇదిలాఉండగా ప్రభుత్వం ఎకరాకు రూ.5 లక్షలు మాత్రమే నష్టపరిహారం ప్రకటించడంతో కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారు. మార్కెట్ ధర ప్రకారం రూ.30 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుండటంతో ఆయా భూముల్లో కాల్వలను తవ్వలేదు. పలుచోట్ల కోర్టుకు వెళ్లనప్పటికీ రైతులు కాల్వ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో తవ్వకాన్ని నిలిపివేశారు. కొన్నిచోట్ల కాల్వలను తవ్వినా సిమెంట్ లైనింగ్ చేయలేదు. దీంతో గుండాల మండలంలో ఇప్పటివరకు ఒక్క గ్రామానికి సరైన రీతిలో సాగు నీరు అందడం లేదు. కాల్వ పరిధిలో 95ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాల్వల నిర్మాణంపై ఆశలు మొదలయ్యాయి.



ఒట్టిపోయిన మాసాన్‌పల్లి చెరువు

పంటలకు సాగు నీరు అందివ్వాలి



రైతులు సాగు చేసుకున్న భూములకు దేవాదుల కాల్వ ద్వారా నీరు అందించాలి. గతంలో చెరువులు, కుంటలు నింపేవారు. ఇప్పుడు చెరువులు కుంటలు కూడా నింపడం లేదు. వర్షాలు లేక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. కాల్వల నిర్మాణాలను వెంటనే చేపట్టాలి.

- ఎలిపెద్ది సుధాకర్‌రెడ్డి, రైతు మాసాన్‌పల్లి

త్వరలో రైతులతో సమావేశం

దేవాదుల ప్రాజెక్టు పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కాల్వలకు సంబంధించి 95 ఎకరాల భూసేకరణ అవసరం. కొంతమంది రైతులు పరిహారం పెంచాలని కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. వీటన్నింటి సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో రైతులతో సమావేశమవుతాం. వారి సమస్య లు పరిష్కరించి, కాల్వల నిర్మాణాలను చేపడతాం.

- ప్రవీణ్, డీఈ, దేవాదుల ప్రాజెక్టు

రిజర్వాయర్‌లోనూ నీరు లేదు

నవాబ్‌పేట రిజర్వాయర్‌లో నీరు లేక పోవడంతో సాగుకు నీటిని విడుదల చేయలేక పోతున్నాం. నవాబ్‌పేట రిజర్వాయర్‌కు ఘణపూర్ నుంచి నీరు రావాలి. ఘణపూర్ నుంచి నవాబ్‌పేట రిజర్వాయర్ వరకు ఉన్న కాల్వల్లోనూ పూడికతో పాటు చెట్లు మొలిశాయి. దీంతో అక్కడి నుంచి నీరు రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తాం

- విద్యాసాగర్, ఏఈ



భువనగిరిలో అసంపూర్తిగా ఉన్న గురుకుల పాఠశాల భవన నిర్మాణం

సమస్యల వలయాలుగా గురుకులాలు

- అరకొర వసతుల మధ్య అద్దెభవనాల్లో
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- కిటికీలు లేక దోమల దండయాత్ర

యాదాద్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలన్నీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. భువనగిరి గురుకులం మినహా మిగతా గురుకులాలు అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. మొత్తం 14లో ఎనిమిది ఎస్సీ విద్యార్థులకు కాగా, ఆరు మహాత్మాజ్యోతిబాపూలే గురుకులాలు ఉన్నాయి. ఎస్సీ గురుకులాల్లో బాలురకు భువనగిరి, రాజాపేట, మోత్కూరు, అడ్డగూడూరు, ఆలేరు, చౌటుప్పల్‌లో ఉండగా ఒక్కో గురుకులంలో 640మంది చొప్పునసీట్లు కేటాయించారు. అదే విధంగా వలిగొండ ఒకేషనల్ గురుకులంలో 720 మందికి, బీబీనగర్‌లోని మహిళా డిగ్రీ(ఆర్మీ) కళాశాలలో మొత్తం 400మంది విద్యార్థినులకు సీట్లు కేటాయించారు. అదేవిధంగా ఆరు మహాత్మాజ్యోతిబాపూలే గురుకులాలకు సంబంధించి పోచంపల్లి, ఆలేరు, భువనగిరిలో బాలురు, మోటాకొండూరు, బీబీనగర్, తుర్కపల్లి, అనంతారంలో బాలికల కు ఒక్కోచోట 640సీట్లను కేటాయించారు. ఒక్క భువనగిరి గురుకులం మినహా 13వరకు అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయుల, నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మరుగుదొడ్లూ కరువే

అద్దె భవనాల్లో గురుకులాలు కొనసాగుతుండటంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవు. ప్రస్తుతం ఉన్న వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. పలుచోట్ల అద్దె భవనాల్లో తరగతి, హాస్టల్ గది పెచ్చులూడుతున్నాయి. భారీ వర్షాలు కురిసిన పక్షంలో రాజాపేటలోని ఎస్సీ గురుకుల పాఠశాల గదులు కురుస్తున్నాయి. డార్మెంటరీ రూం, క్లాస్ రూంలకు డోర్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. కిటికీలు, తలుపు రెక్కలు ఊడిపోయాయి. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్‌లోని పాత భవనంలోనే తరగతులు కొనసాగుతుండటంతో ఇబ్బందిగా ఉంది. రూ.20కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించలేదు. మోత్కూరులోని గురుకుల పాఠశాలలో ఐదేళ్ల క్రితం ఇచ్చిన బెడ్‌షీట్లు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. కిటికీలు లేకపోవడంతో దోమలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌటుప్పల్‌లోని గురుకులంలో మంచినీటి సరఫరా మెరుగుపరిచేందుకు ట్యాంక్ నిర్మించాల్సి ఉంది. బాలికల సౌలభ్యం కోసం డార్మెంటరీ హాల్‌ను నిర్మించాల్సి ఉంది.

పెచ్చులూడుతున్న పైకప్పు

భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. 5వ తరగతి నుంచి ఇంటర్‌వరకు ఉన్న ఈ గురుకులలో 600మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపుగా 40ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. తరగతి గదులతో పాటు డార్మెంటరీ హాల్ వర్షాలకు కురుస్తూ విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. రూ.2కోట్లతో ఆరేళ్ల క్రితం ప్రతిపాదించిన నాలుగుఅంతస్తుల భవనం పనులు ఏడాదిన్నరగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ఏప్రిల్ 16న కలుషిత ఆహారం కారణంగా 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తీవ్రఅస్వస్థతకు గురైన ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్(11) చికిత్సపొందుతూ మృతి చెందాడు. మిగతా విద్యార్థులు కోలుకున్నారు. ఈ ఘటనతో ప్రిన్సిపాల్ శ్రీరామ్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. ఇప్పటివరకు ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. కలుషిత ఆహార ఘటనలపై అధికారులు నియమించిన కమిటీ ఆహార నాణ్యతాలోపం, కలుషిత నీరు ఉన్నట్టుగా నివేదిక ఇచ్చింది. నివేదిక ఆధారంగా తాగునీటి వ్యవస్థను ఆధునికీకరించారు. ఆహార నాణ్యత పెంపునకు చర్యలు చేపడుతున్నారు.

మెడికల్ కళాశాలకు త్వరలో శంకుస్థాపన

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మల్లాపురంలో మెడికల్ కళాశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న విప్ అయిలయ్య, కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 12: మెడికల్ కళాశాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం మండలంలోని మల్లాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 64లో కళాశాల నిర్మాణానికి 20ఎకరాల స్థలాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పరిశీలించిన స్థలంలో గుట్టలు, కొండలు ఉండటంతో కళాశాల నిర్మాణానికి ఇబ్బందిగా ఉంటుందని, అదే సర్వేనంబర్‌లో కళాశాలకు అవసరమయ్యే 20ఎకరాల స్థలాన్ని పరిశీలించి భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుతం పరిశీలించిన స్థలం కళాశాల నిర్మాణానికి అనుకూలంగా ఉందని, ఇదే స్థలంలో శంకుస్థాపన చేస్తామన్నారు. మల్లాపురంలో కళాశాల నిర్మాణం జరగడం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అమరేందర్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ, నాయకులు కళ్లెం శ్రీనివాస్‌గౌడ్, గడసంతల శ్రీశైలం, గుట్ట మునిసిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణి, గోపి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 12: 'ప్రజావాణి' ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో 72 ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి సత్వరం పరిష్కరించాలన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 55 ఉండగా, ఎంప్లాయిమెంట్ ఐదు, పంచాయతీరాజ్ నాలుగు, అటవీ, మునిసిపాలిటీ రెండు, మహిళ, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య, పోలీసుశాఖలకు చెందినవి ఒకటి చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.బెన్‌షాలోమ్, కే.గంగాధర్, జడ్పీ సీఈవో శోభరాణి, కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



'ప్రజావాణి'లో ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

● భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వలిగొండ మండలం మల్లేపల్లి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం-గౌరెల్లి జాతీయ రహదారి-930 విస్తరణలో విలువైన భూములు కోల్పోతున్నామని, బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎం.రాములు, అయ్యన్న, ఈ.నర్సింహ, నరేష్, సత్యనారాయణ, బి.మల్లారెడ్డిలతో పాటు సుమారు 20మంది రైతులు వినతిపత్రం అందజేశారు.

● దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కళ్లెం కృష్ణ, ఏశాల అశోక్ 'ప్రజావాణి'లో వినతిపత్రం అందజేశారు. వారివెంట నాయకులు జల్లి రాములు, అన్నెబోయిన వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

● ఆలేరు మండలం శారాజీపేట రెవెన్యూ పరిధి సర్వే నంబరు 577లో కురుమ సంఘానికి చెందిన రెండెకరాల భూమిలో బీరప్ప ఆలయం నిర్మించగా, గ్రామానికి చెందిన కొంతమంది పేరున భూమి నమోదైందని, దీనిపై సమగ్ర విచారణ చేసి ఆలయ భూమిగా నమోదు చేయాలని గ్రామస్థులు అయిల రాములు, అయిల వీరస్వామి వినతిపత్రం అందజేశారు.

● యాదగిరిగుట్ట మల్లాపురం రెవెన్యూలోని సర్వే నంబరు 6ఏ/76లో తన మామ నారా శంకరయ్య నుంచి సంక్రమించాల్సిన 0.28గుంటల భూమి తన ఆడబిడ్డ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎన్‌వోసీ లేకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని ఆ భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని నారా కృష్ణవేణి వినతిపత్రం అందజేసింది. ● సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చిందు కులాన్ని ఎస్సీ-ఏ కేటగిరీలో చేర్చాలని జిల్లా చిందు యక్షగాన కళాకారుల సంఘం నాయకులు గడ్డం రాజలింగం, పల్లిట్ల చక్రపాణి, గడ్డం శంకరయ్య, వెంకట్రాములు, ఆయోధ్య, ముత్తులింగం, శ్రీనివాస్, పిల్లిట్ల ముకుంద, వినతిపత్రం అందజేశారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్ వినతిపత్రం అందజేశారు. మునిసిపాలిటీ ప్రధాన రహదారిని నిబంధనల ప్రకారం 50 అడుగుల వెడల్పుతో విస్తరించాలని, విస్తరణలో పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని, లేదంటే ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఉన్నారు.

కదిలిన యంత్రాంగం

- ఎర్రబెల్లి, గోపాలపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు
- జర్వ బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరణ
- పారిశుధ్య లోపమే కారణమని అధికారుల వెల్లడి
- నల్లబండగూడెం, అమీనాబాద్‌లో ఫీవర్ సర్వే

•7లో..

ఖిల్లాకు ఇక పర్యాటక కళ



100ఫీట్ల రహదారిగా అభివృద్ధికి నోచుకోనున్న ప్రస్తుత రోడ్డు

- 10 రోజుల్లో టెండర్లు
- రెండు దఫాలుగా రూ.88కోట్లతో పనులు

భువనగిరి టౌన్, ఆగస్టు 12 : భువనగిరి ఖిల్లా అభివృద్ధిపై ఏళ్ల తరబడి పెట్టుకున్న స్థానికుల, పర్యాటకుల ఆశలు త్వరలో సాకారం కానున్నాయి. స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులు పురోగతి సాధిస్తున్నా యి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఖిల్లా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటికి సంబంధించి వారం, 10 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పట్టాలు ఎక్కనుంది. ఎల్‌అండ్‌టీ ఇంజనీరింగ్ సంస్థ డీపీఆర్‌ను పూర్తి చేయగా రాష్ట్రంలో పర్యాటక స్థలాల అభివృద్ధికి రాష్ట్ర టూరిజం శాఖ నూతనంగా ఏర్పాటుచేసిన టూరిజం ఎక్స్‌పీరియన్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(టీఈడీఎంఏ) పర్యవేక్షణలో టెండర్లను పిలవనున్నారు. నిర్మాణంతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతల నిబంధనతో పిలుస్తున్న టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే యుద్ధప్రతిపాదికన పనులు మొదలుకానున్నాయి అయి తే మొదటి దఫాలో రూ.56కోట్లతో, రెండో దఫాలో రూ.32కోట్లతో పనులు చేపడతారు. మొదటి దఫా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే రెండో దఫా పనుల డీపీఆర్ రూపకల్పనను మరో మారు ఎల్‌అండ్‌టీకి అప్పగించనున్నారు.

మొదటి దఫాలో అభివృద్ధి ఇలా

భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ద్విముఖవిధానం పాటిస్తున్నారు. ప్రస్తుతం నల్లగొండ రోడ్డు వెంట ఉన్న ఖిల్లా ప్రధాన ద్వారం, మెట్ల మార్గాన్ని ఆధునికీకరిస్తూ, బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసే రోప్‌వే బేస్‌క్యాంపు పరిసరాలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే ఖిల్లా పైభాగంలో, దిగువలో షాపింగ్ మాల్స్, ఫుడ్ కోర్ట్, ఎంటర్‌టైన్మెంట్ జోన్స్ అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు మొదటి దఫాలో రోప్‌వే, బేస్ క్యాంప్ సమీపంలో ఫుడ్ కోర్ట్, తదితర వసతులు కల్పిస్తారు. బేస్ క్యాంపు నుంచి ఖిల్లా వరకు వెళ్లే రోప్‌వే తీగల దిగువ భాగంలో రోడ్డును నిర్మిస్తారు. నల్లగొండ రోడ్డులోని ఖిల్లా ముఖద్వారం నుంచి అమ్మకుంట వరకు సుమారు 680 మీటర్ల పొడవున నాలుగు లేన్స్‌గా 100ఫీట్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు. దీంతో ఖిల్లా వెంట నల్లగొండ రోడ్డు, బైపాస్ రోడ్డు మధ్య లింక్ రోడ్డు అందుబాటులోకి రానుంది. రోడ్డుకు ఇరువైపులా ఒక్కో లేన్‌కు పార్కింగ్‌కు కేటాయిస్తారు. 100 ఫీట్ల రహదారి మధ్యలో ఇరువైపులా తెరచుకొనేలా స్టాల్స్‌ను నిర్మిస్తారు. రహదారి ప్రారంభంలో ఖిల్లా చారిత్రక వైభవాన్ని చాటేలా ఆర్చి నిర్మించనున్నారు. ప్రస్తుత టికెట్ కౌంటర్‌ను ఆధునికీకరించి వెనకాల వృథాగా ఉన్న భవనం స్థానంలో నూతన డిజైన్‌తో మరో భవనం నిర్మిస్తారు. మొదటి మెట్టు నుంచి చివరి మెట్టు వరకు నూతన టెక్నాలజీతో అభివృద్ధి చేసి పర్యాటకుల భద్రతకు రేలింగ్ ఏర్పాటుచేస్తారు. ఖిల్లా పైన ఉన్న చారిత్రక కట్టడాల ఆనవాళ్లకు భంగం కలుగకుండా ఫుడ్ కోర్ట్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్, మ్యూజియం, ఏర్పాటుచేయనున్నారు. చారిత్రక ప్రాంతాల్లో వివాహాలు, జన్మదిన తదితర శుభకార్యాలను జరుపుకునే ఒరవడి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో ఖిల్లాపైన భారీ నీటి కొలను వద్ద 50 సీట్ల కెపాసిటీ గల పార్టీ జోన్‌ను అభివృద్ధి చేస్తారు. పార్టీ జోన్‌లో కృత్రిమ జలపాతం తదితర ఆకర్షణీయ ఏర్పాట్లు ఉండనున్నాయి. అంతేకాక రాత్రిపూట ఖిల్లా శోభను చాటేలా లైటింగ్, పర్యాటకుల భద్రత లక్ష్యంగా సీసీ కెమెరాలు, తాగునీరు, మూత్రశాలలు తదితర మౌళిక వసతులు కల్పించనున్నారు.

రెండో దఫాలో

మొదటి దఫాలో ప్రతిపాదిత పనులు చివరి దశకు చేరుతున్న క్రమంలో రెండోదఫా పనులను చేపడతారు. ఫంక్షన్స్ నిర్వహణకు అనువుగా రోప్‌వే బేస్‌క్యాంపు సమీపంలో కన్వెన్షన్లు నిర్మిస్తారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతారు. భవిష్యత్‌లో అమ్మకుంటను బోటింగ్ పాయింట్‌గా తీర్చి దిద్దే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోనే మొట్టమొదటి రోప్‌వేను భువనగిరి ఖిల్లా పైకి ఏర్పాటుచేస్తుండటం, ఇప్పటికే యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం, తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి చెందుతున్న స్వర్ణగిరి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన భువనగిరి ఖిల్లాపైకి కూడా పర్యాటకుల రద్దీ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పర్వతారోహణ శిక్షణలో దేశవ్యాప్తంగా పేరు గడించిన భువనగిరి ఖిల్లా ఖ్యాతి మరింత విస్తృతం కానుంది. అదేసమయంలో స్థానికంగా వ్యాపార ఉపాధి అవకాశాలు మెరుగుకానున్నాయి.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, కొండపైన పర్వతవర్థిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహిం చారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.17,71,886 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

భక్తుల రక్షణ కోసం షెడ్డు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపై ఎండ, వాన నుంచి భక్తుల రక్షణ కోసం జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డు అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు ఆదివారం రాత్రి నుంచి ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించి తెల్లవారుజాము వరకు పూర్తిచేశారు. ఆలయ అందాలకు అడ్డుగా ఉందనే అభిప్రాయాల మేరకు ఉత్తర రాజగోపురం తర్వాత నిర్మించిన ఈ షెడ్డుతో భక్తులకు ఎంతో కొంత నీడ లభించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత ఇంకా తగ్గకపోవడం, అకస్మాత్తుగా కురిసే వర్షానికి భక్తులు తలదాచుకునే చోటులేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు తిరిగి ఆలయ ఉత్తర తిరుమాఢ వీధుల్లో భారీషెడ్డును అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈ షెడ్డు ఏర్పాటుతో ఆలయ సహజత్వం, అందాలకు అడ్డుగా మారిందని కొంత మంది భక్తుల నుంచి విమర్శలు రాగా రథశాల ముందు గ్రీనరీ భాగం నుంచి రిటైనింగ్ వాల్ వెంట నేరుగా కొండ కింది వైకుంఠ ద్వారం వరకు శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. దీని వెంట వేసవిలో చలువ పందిళ్ల ఏర్పాటు చేయగా ఇందుకోసం రిటైనింగ్ వాల్ వెంట ఉన్న చెట్లను కూడా తొలగించారు. త్వరలో ప్రతిపాదనలు మోక్షం కలగనుండగా అప్పటి వరకు భక్తులు సేద తీరేందుకు తిరిగి షెడ్డు అందుబాటులోకి తెచ్చినట్లు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి తెలిపారు.



శివాలయంలో స్ఫటికలింగానికి హారతిఇస్తున్న అర్చకుడు

ఖమ్మం నుంచి భక్తుడి పాదయాత్ర

రేవంత్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టినందుకు ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రనాగుల రమేష్‌నాయక్ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం నుంచి పాదయాత్ర ప్రారంభించి సోమవారం యాదగిరిగుట్టకు చేరుకొని వైకుంఠ ద్వారం(స్వామివారి పాదాలు) చెంత సీఎం చిత్రపటంతో మొక్కు తీర్చుకున్నాడు. అనంతరం కొండపైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకొని పూజలు చేపట్టి మొక్కు తీర్చుకున్నాడు. వంద రోజుల దీక్షలో భాగంగా శాకాహార భోజన నియమాలతో క్షేత్ర సందర్శన చేసినట్లు భక్తుడు తెలిపారు. మరో ఐదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఏకశిఖరవాసుడిని కోరుకున్నట్లు తెలిపాడు.

దేవస్థానం పాలకమండలి నియమించాలి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి సంబంధించి పాలకమండలిని నియమించాలని భాగ్యనగర్ అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కోరారు. సోమవారం యాదగిరిగుట్టలో అయిలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో పాలకమండలి నియామకం జరగలేదని, పాలకమండలిని నియమించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉడుత యాదగిరి, నలుబాల ఎర్రయ్య ఉన్నారు.

కదిలిన యంత్రాంగం

- ఎర్రబెల్లి, గోపాలపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు
- జర్వ బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరణ
- పారిశుధ్య లోపమే కారణమని అధికారుల వెల్లడి


నిడమనూరు: ఎర్రబెల్లిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


హుజూర్‌నగర్: గోపాలపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

నిడమనూరు, హుజూర్‌నగర్, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న బాధితుల కోసం ఆయా జిల్లాల వైద్యాధికారులు కదిలారు. 'నిడమనూరుకు జ్వరమొచ్చింది' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎర్రబెల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 330 ఇళ్లకు వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు కూడా సేకరించారు. సాధారణ జ్వరాలే అని నిర్ధారించారు. జ్వరాలు వ్యాపించడానికి గల కారణాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య సిబ్బందితో పర్యటించి నీటిని పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదిలారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో దోమల నివారణ కోసం తరచూ ఫాగింగ్ చేయాలని నల్లగొండ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పారిశుధ్యం లోపించడం కారణంగానే జ్వరాలు వస్తున్నాయని, సీజనల్ వ్యాధులు రావడం సహజమేనన్నారు. సాధారణ జ్వరాలేనని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జ్వరాలు పూర్తిగా నివారించేందుకు వైద్య శిబిరాలు కొనసాగించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రఫి, సీహెచ్‌వో రమేష్, హెచ్‌ఈవోలు ప్రభాకర్, వాసుదేవరెడ్డి, పీహెచ్ఎన్ రజిని, గంటా సోమయ్య, జోసెఫ్, మంజుల, సుచిత్ర, స్వప్న, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోపాలపురంలో తొమ్మిది బృందాలతో సర్వే

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో జిల్లా వైద్యశాఖాధికారులు తొమ్మిది బృందాలు గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వస్తాయని, వాటిని దరిచేరనీయవద్దన్నారు. గృహ పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు ఒకరి నుంచి ఒకరికి వస్తాయన్నారు. కలుషితమైన ఆహారపదార్థాలు, ఈగలు, దోమలు వాలిన ఆహారాలు తినడం వల్ల కూడా ఈ వ్యాధులు వస్తాయన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. విషజ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నల్లబండగూడెం, అమీనాబాద్‌లో ఫీవర్ సర్వే

కోదాడ రూరల్, అనంతగిరి: కోదాడ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నల్లబండగూడెం గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో ఉపేందర్, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, యాతాకుల మధుబాబు పాల్గొన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతన్న దృష్ట్యా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో ఉన్న రోగులను గుర్తించి రక్త నమూనాలను సేకరించారు.

'సాగర్' క్రస్ట్ గేట్లు మూసివేత

- ఎనిమిది రోజుల్లో 174.82 టీఎంసీల నీటి విడుదల


మూసి ఉన్న నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 12: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మూసివేశారు. సాగర్‌కు ఎగువనుంచి వరద రాక తగ్గడంతో క్రస్ట్ గేట్లను మూసివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కృష్ణాబేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండడంతో సాగర్‌కు జూలై 29వ తేదీ నుంచి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద రాక మొదలైంది. దీంతో సాగర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువ కావడంతో ఈ నెల 5వ తేదీన క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం ఎనిమిది రోజుల్లో క్రస్ట్ గేట్ల ద్వారా 174.82 టీఎంసీల నీటిని సాగర్ నుంచి దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో సాగర్ నుంచి ఎనిమిది రోజుల్లో మొత్తం 174.82 టీఎంసీల నీరు కడలి పాలైంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (215.6070 టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువనుంచి 77,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి శ్రీశైలం నీటి మట్టం 881.20 అడుగులుగా(194.3096టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,211 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 588.80 అడుగులుగా(308.4658టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,035 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,211 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఈ నెల 5వ తేదీన సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు విడుదల చేయడంతో ఎనిమిది రోజుల పాటు పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం గేట్లన్నీ మూసివేయడంతో పర్యాటకులు లేక సాగర్ పరిసర ప్రాంతాలు బోసిపోయి కనిపించాయి.

'మూసీ'కి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. గేట్లు మూసివేత

మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మూసీ నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు దిగువన గల ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 731.24క్యూసెక్కులు ఉండగా, సోమవారం సాయంత్రానికి కొంత మేరతగ్గి 961.10క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటి మట్టం సోమవారం సాయంత్రానికి 641.84అడుగులుగా (3.65టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి కాల్వకు 256.21 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 256.21 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల' ప్రాజెక్టుకు ఆగిన వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద నిలిచిపోవటంతో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు)గా కాగా, సోమవారం సాయంత్రానికి 169.42 అడుగులుగా(37.54 టీఎంసీలు) నమోదైంది. తెలంగాణ జెన్కో జల విద్యుత్ కేంద్రానికి 12వేల క్యూసెక్కుల వరద నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 80మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 12వేల క్యూసెక్కులు కాగా, ఎటువంటి ఇన్‌ఫ్లో లేదు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటికి తెస్తున్న గ్రామస్థులు

చిలుకూరు, గరిడేపల్లి, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం పరిధిలో గల సాగర్ కాల్వలో సోమవారం మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో ఆదివారం ఓ వివాహానికి హాజరైన హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చిమల్ల వెంకట్(21) సాగర్ కాల్వలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం పోలేనిగూడెం పరిధిలోని అగ్రికల్చర్ కళాశాల సమీపంలో సాగర్ కాల్వలో వెంకట్ మృతదేహం తేలియాడడంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటికి తీసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ప్రశాంతిపూరితండా హైవే సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంతిపూరి తండాకు చెందిన కేతావత్ చంద్ వ్యవసాయ పొలంలో ఎలాంటి గాయాలు లేకుండా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహంపై కుడి చేతిపై యాదవ్(జేఈ) అనే టాటూస్ ఉందని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక రైతు ● రైలుకింద పడి యువకుడు ● పురుగుల మందు తాగి వివాహిత

నాగార్జునసాగర్, భువనగిరి రూరల్, అడ్డగూడూరు, ఆగస్టు 12: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతాళలేక నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాలో రైతు, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన యువకుడు, అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది.

అప్పులు చేసి బోర్లు వేసి..


కృష్ణ(ఫైల్)

నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాకు చెందిన జటావత్ కృష్ణ(40) తనకున్న 10ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలతో పాటు బత్తాయి తోట పెట్టాడు. బత్తాయి తోట ఎండిపోతుండడంతో ఎనిమిది బోర్లు వేయించాడు. వ్యవసాయం, బోర్లు వేయించేందుకు సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేశాడు. బోర్లు పడక పోగా తోట ఎండిపోయే దశకు వచ్చింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉన్న కృష్ణ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లాడు. మండల పరిధిలో పెద్దగూడెం స్టేజీ సమీపంలో పురుగుల మందు తాగి పడుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్సనిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నాన్న.. తమ్ముడిని మంచిగా చూసుకో..


మధు(ఫైల్)

భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన లస్కర్ మధు(27) రెవెన్యూ అడిషినల్ కలెక్టర్ వద్ద ఔట్‌సోర్సింగ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరు కాలేదు. సాయంత్రం రాయిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని రైలు పట్టాల సమీపంలో నిలిపివేసి సెల్‌ఫోన్‌ను, రూ.200 నోట్‌ను బైక్ ముందు కవర్‌లో పెట్టి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలం వద్ద బైక్ కవర్ లోపల ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి ఆచూకీ కనుగొని మధు తండ్రి రాజుకు సమాచారం ఇచ్చారు. లభ్యమైన రూ.200 నోట్‌పై అన్నయ్య అమ్మ, నాన్న, తమ్ముడిని మంచిగా చూసుకో.. ఐ మిస్.. ఐ లవ్ మై ఫ్యామిలీ .. నా వల్ల కావట్లేదు' అని రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగి..


కవిత(ఫైల్)

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన యాదగిరి, అతని భార్య కవిత(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పత్తి చేనుకు పురుగుల మందు కొట్టాలని యాదగిరి పురుగుల మందుల తెచ్చి ఇంటి లోపల పెట్టి బయటికి వెళ్లాడు. కవిత ఆ పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి యాదగిరికి సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం తిరుమలగిరి మండలంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కవితి సోదరుడు సోమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కారు అదుపుతప్పి లారీని ఢీకొని..

దామరచర్ల, ఆగస్టు 12: కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని వీరభద్రాపురంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సోమవారం జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన ఆదిపూడి శ్రీనాథ్(40) స్థానికంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సింధు పిల్లలతో కలిసి గుంటూరులో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం విధులు ముగించుకున్న శ్రీనాథ్ రెండు రోజులు సెలవు కావడంతో గుంటూరులోని భార్య వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. వాహనం వేగంగా వెళ్తున్న క్రమంలో దామరచర్ల మండలకేంద్రంలోని వీరభద్రాపురం నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రాంగ్‌రూట్‌లోకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనాథ్ భార్య సింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనాథ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గొర్రెలు మేపుతుండగా..

మిర్యాలగూడ అర్బన్: రైలు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మిర్యాలగూడ మండలం రాఘవాపురంతండాకు చెందిన రమావత్ పాండ్య(65) గొర్రెల కాపరిగా వెళ్లాడు. పాండ్య చెవుడు ఉన్నట్లు తండావాసులు తెలిపారు. రైలుపట్టాల సమీపంలో 112/18 మైలురాయి వద్ద గొర్రెలు మేపుతుండగా కొన్ని జీవాలు రైలుపట్టాలపైకి వెళ్లాయి. వాటిని పక్కకు తప్పించేందుకు రైలుపట్టాలపైకి వెళ్లిన కాపరి పాండ్య చెవుడుతో సికింద్రాబాద్ నుంచి శబరి వైపు వెళ్తున్న 17230 నెంబరుగల రైలు శబ్దాన్ని గ్రహించలేకపోయాడు. అప్పటికే వేగంగా దగ్గరకు దూసుకొచ్చిన రైలు నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పాండ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండ్య కుమారుడు రమావత్ మగ్గా ఫిర్యాదు మేరకు నల్లగొండ జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

77 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామ శివారులోని ఓ షెడ్డులో నిల్వ చేసిన 52 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడుతండాకు చెందిన ధరావత్ మహేందర్ వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 52క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. మహేందర్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ షేక్‌గౌస్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బాలమణి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో దాడి చేశారు. కాలనీకి చెందిన రమణ ఓ రహస్య ప్రదేశంలో అద్దెకు తీసుకున్న షెడ్డులో రేషన్ బియ్యం డంపుచేసి ఇతర ప్రాంతానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధమవుతుండగా విశ్వసనీయ సమాచారం తనిఖీలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీలు జరిపి నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకొని నిందితుడిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్ తెలిపారు.

గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధం



తిప్పర్తి, ఆగస్టు 12: గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామ సమీపంలో సోమ వారం జరిగింది. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన సుంకరబోయిన రమేష్ స్కూల్ పిల్లలను తీసుకెళ్లడానికి గత సంవత్సరం సెకండ్ హ్యాండ్ మారుతి ఓమ్ని వ్యాన్‌ను కొనుగోలు చేశాడు. కొన్ని రోజులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఉపయోగించాడు. వాహనం మరమ్మతులకు గురికా వడంతో అక్కడ మానేసి నల్లగొండలోని ఓ గ్యారేజ్‌లో రిపేర్ చేసుకొని వస్తున్నాడు. తిప్పర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా వాహనం ఆగిపోయింది. పొగలు రావడంతో భయాందోళనకు గురైన రమేష్ వాహనం దిగి పక్కకు వెళ్లాడు. పెద్ద ఎత్తున మంట రావడంతో 100కు డయల్ చేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు నల్లగొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదానికి వాహనంలో గ్యాస్ లీకేజీనే కారణమని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చర్చించుకుంటున్నారు.

ఏడు గొర్రె పొటేళ్ల చోరీ

తుర్కపల్లి, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీల్యానాయక్‌తండాలో భూక్య లచ్చిరాంనాయక్‌కు చెందిన ఏడు గొర్రె పోటేళ్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తు లెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతుకు రూ.1.20లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన లచ్చిరాంనాయక్ తన గొర్రెలను పొద్దంతా అడవిలో మేపి సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల పాకలో గొర్రెలన్నింటినీ ఉంచి ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున మంద వద్దకు వచ్చి చూసే సరిక మందలో ఏడు గొర్రె పొటేళ్లు లేవనే విషయాన్ని గుర్తించాడు. వాటి ఆచూకీ కోసం పరిసరాలు వెతికినా దొరకలేదని తెలిపాడు. తన గొర్రె పొటేళ్లను దొంగలే ఎత్తుకెళ్లారని, దీంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నార్కట్‌పల్లి, ఆగస్టు 12: కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన అక్కా చెల్లెళ్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఈ నెల 11, 12వ తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో విక్టరీ షాటోకాన్ 12వ జాతీయ స్థాయి కరాటే ఛాంపి యన్ షిప్ పోటీలు జరిగాయి. కుమితేలో అండర్-14 బాలికల విభాగం 38 కేజీల కేటగిరీలో మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాసోజు సౌమ్య బంగారు పతకం సాధించింది. అండర్-17 బాలికల విభాగం సీనియర్ లేవల్ కటాస్‌లో సౌమ్య సోదరి ఇదే పాఠశాల పూర్వ విద్యార్థిని దాసోజు సంజన కూడా ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు జిల్లా కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ దాసోజు నర్సింహాచారి తెలిపారు. పతకాలు సాధించిన అక్కా చెల్లెళ్లను పలువురు అభినందించారు.

విద్యార్థులకు బంగారు పతకాలు



మోత్కూరు: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర కరాటే అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మోత్కూరు మండలం దాచారం విద్యార్థులు ప్రతిభ చాటి పలు విభాగాల్లో పది బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. కటా విభాగంలో సిహెచ్. అభిరామ్, ఎల్.హర్షిత, సిహెచ్. చరణ్‌తేజ్, ఫైట్ విభాగంలో సిహెచ్.అభిరామ్, సిహెచ్.చరణ్‌తేజ్ బంగారు పతకాలు, కటా విభాగంలో ఎం. కార్తీక్ రజత పతకం, బి. నిఖిల, ఎం. మణిదీప్, సిహెచ్. రాజు, సిహెచ్. చరణ్ సిల్వర్ పతకాలు సాధించారని కరాటే కోచ్ డాక్టర్ వేముల సైదులు తెలిపారు. ఆయనను బెస్ట్ కోచ్ అవార్డుతో సన్మానించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల గ్రామపంచాయతీ మదిరె పొలిమేరాజులబావి గ్రామంలో నిమ్మల దశరథ అనే రైతుకు చెందిన కాడి ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. సదరు రైతు తన పత్తి చేనులో గుంటుక తోలడానికి నాగలితో కూడిన ఎడ్లను పక్క రైతు పొలంలో నుంచి తోలుకొని వెళ్తుండగా కర్రలపై వేలాడుతున్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు ఎడ్లకు తగలగా గమనించిన రైతు వెంటనే తన చేతి కర్రతో తీగలపై కొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు తప్పించుకోగ రెండవ ఎద్దు విద్యుదాఘాతంతో అక్కడేపడి మృతిచెందినట్లు బాధిత రైతు వాపోయాడు. ఎద్దు విలువ సుమారు రూ. 85వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

గీత కార్మికుడికి గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 12: తాటిచెట్టుపై నుంచిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబటి చిన్న యాదయ్య రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావ డంతో యాదయ్యను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామస్థులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తలూరు గ్రామ శివారులో అంబారిపేట వెళ్లే దారిలో బోయనపెల్లి సోమేశ్వరరావు భూమిలో ఉన్న పురాతన గౌడ కుల దైవం కాటమయ్య గుడిలో ఆదివారం రాత్రి తవ్వకాలు జరిగాయి. దుండగులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన శంకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

● లబ్ధిదారులు, అఖిలపక్ష నాయకుల డిమాండ్

భువనగిరి రూరల్, ఆగస్టు 12: ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించి కార్యాలయ ముట్టడికి యత్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి శివారులోని సింగన్నగూడెంలో 444మంది లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇప్పటి వరకు వారికి ఇళ్లు కేటాయించకపోవడం సరికాదన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుతున్నాయని వెంటనే వాటికి మౌలిక వసతులు కల్పించి కేటాయించాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట దాదాపు 2గంటల పాటు ధర్నా నిర్వహించి రోడ్డుపైకి నిరసన తెలిపేందుకు వస్తుండగా పోలీసులు జోక్యం చేసుకుని తహసీల్దార్ అంజిరెడ్డిని ధర్నా స్థలానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా తమకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని తహసీల్దార్‌తో వాగ్వాదం చేసి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఏవీ.కిరణ్‌కుమార్, బట్టు రామచంద్రయ్య, బట్టుపల్లి అనురాధ, మాయ కృష్ణ, ఏశాల అశోక్, రత్నపురం బలరాం, చందా మహేందర్, దిడ్డికాడి భగత్, సిర్పంగ సుభాష్, కూతాడి సురేశ్, బబ్లు, రాజశేఖర్, భిక్షపతి, పుట్ట రమేశ్, చింతల మల్లేశ్, కొత్త సత్యం, తుమ్మల పాండు, గంగారం స్వామి ఉన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైతులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్షం, డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు

పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి: సీపీఎం

భువనగిరి మండలం హన్మాపురంలో దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హన్మాపురం రెవెన్యూ పరిధిలోని 87సర్వే నెంబర్‌లో 15.06 ఎకరాల ప్రభుత్వ భూమిలో దళిత రైతులు సాగు చేసుకుంటున్నారని, వారికి వెంటనే పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ కె.కల్యాణ్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో పట్టాదార్ సాధన కమిటీ ప్రతినిధులు, రైతులు మహేందర్, రాజు, రామచందర్, మల్లేష్, జనార్ధన్, కొండల్, మైసయ్య, ప్రభాకర్, ఉప్పలయ్య, లింగయ్య ఉన్నారు.

రేపటినుంచి సదరం స్లాట్లు అందుబాటులోకి..

భువనగిరి అర్బన్, ఆగస్టు 12: వివిధ రకాల శారీరక వైకల్యం ఉన్న వారికోసం ఈనెల 14నుంచి సదరం స్లాట్లు అందుబాటులోకి రానున్నాయని డీఆర్డీవో టీ.నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న రెన్యూవల్, కొత్తగా స్లాట్లు నమోదు చేసుకునేవారు మీ సమీపంలో మీ-సేవ కేంద్రాలను ఉదయం 11గంటలకు సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ నెల 16న కంటి లోపం ఉన్నవారికి కొత్తవి 30, రెన్యూవల్ 10, ఆర్థోపెడిక్ (శారీరకలోపం) సంబంధించి 17, 21, 24, 31 తేదీల్లో (ఒక్కొక్క రోజు) కొత్తవి 50, రెన్యూవల్ 20, వినికిడి లోపం సంబంధించి 27న కొత్తవి 50, రెన్యూవల్ 20, మానసిక రుగ్మతకు సంబంధించి 28న కొత్తవి 40, రెన్యూవల్ 10 స్లాట్ల బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక రోగులు సదరం క్యాంపుకు దరఖాస్తులు చేసుకోకూడదని పేర్కొన్నారు. మీ-సేవలో నమోదు చేసుకొని అందుకు సంబంధించిన మెసేజ్ అందిన వారు మాత్రమే జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి రావాలని ఆయన సూచించారు. ఆధార్, రేషన్, ఓటర్ కార్డులతో పాటు వైద్యుడి రిపోర్టులతో శిబిరంలో పాల్గొనాలని కోరారు. వైద్యులు పరీక్షించి వికలత్వ శాతాన్ని నిర్ధారించిన తర్వాత సదరం ధ్రువపత్రం అందజేస్తామని, వైద్యుడు అందుబాటులో లేకుంటే క్యాంపు రద్దు అవుతుందని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్డీవో నాగిరెడ్డి

భువనగిరి అర్బన్: జిల్లా డీఆర్డీవోగా టీ.నాగిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎం.ఏ కృష్ణన్ బదిలీపై హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లగా ఆయన స్థానంలో ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన నాగిరెడ్డి తిరిగి బాధ్యతలు చేపట్టారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మోత్కూరు, ఆగస్టు 12: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఈ నెల 8 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఏఐ కోఆర్డినేటర్, మోత్కూరు జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి ప్రవేశం కోసం గతంలో విద్యనభ్యసించిన పాఠశాల నుంచి ఇచ్చిన టీసీ లేదా రికార్డు షీట్, కమ్యూనిటీ నేటివిటీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మూడు ఫొటోలు, ఇంటర్‌లో ప్రవేశం కోసం పదో తరగతి మార్కుల మెమో, కమ్యూనిటీ నేటివిటీ సర్టిఫికెటు, ఆధార్‌కార్డు మూడు ఫొటోలతో నిర్ణీత ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు. అడ్మిషన్ తీసుకోవడానికి సెప్టెంబరు 10 చివరి తేదీ అన్నారు. పూర్తి వివరాలకు అసిస్టెంటు కోఆర్డినేటర్ బత్తిని రామకృష్ణ సెల్ నంబరు 9848339844లో సంప్రదించవచ్చన్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో నవభారత్ విద్యార్థికి రెండో ర్యాంక్



ర్యాంకర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌గౌడ్

భువనగిరి టౌన్, ఆగస్టు 12: ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెట్‌లో భువనగిరి శ్రీ నవభారత్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన పోకల క్రాని ఎంఏ.ఇంగ్లీష్‌ను యూనివర్సిటీ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఎంఎస్సీ కెమిస్ట్రీలో చిత్తర్ల శివాణి 56వ ర్యాంక్, ఎంకామ్‌లో పట్వారి మృదుల 176వ, బొగురంపాటి స్నేహిత 213వ ర్యాంక్, ఊదరి లక్ష్మీప్రియ 538వ ర్యాంక్, రుహీనాజబీన్ 642వ ర్యాంక్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ప్యారారం స్వాతి 291వ ర్యాంక్, జివిలిక పల్లవి 628వ ర్యాంక్, ఎంఎస్సీ గణితంలో మేకల అర్చన 319, ప్యారారం స్వాతి 330, ఎంఏ తెలుగులో ముద్దసాని దీపిక 704వ ర్యాంక్ సాధించారు. కాగా వివిధ విభాగాల్లో పుట్టల కావ్య, మేడబోయిన విజయేంద్రకుమార్, పసుల రేఖ, పత్తి కీర్తన, సోమారం ప్రవళి, కన్నెబోయిన అనూష, మరిపెల్లి శ్రావణి ఉత్తమ ర్యాంక్‌లు సాధించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్ గౌడ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ ఎల్లేష్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మలగూడెం గ్రామ వాసికి డాక్టరేట్

రామన్నపేట, ఆగస్టు 12: అటమర్ ఇంటర్నేషనల్ టెక్నాలజీ యూనివర్సిటీ, మనం ఫౌండేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన తావుటం ఉమామహేశ్వర్‌కు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉచిత ఐ క్యాంపులు నిర్వహించి పెద్ద సంఖ్యలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి అంధత్వాన్ని నిర్మూలించడంలో ఎంతో కృషి చేసినందుకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉమామహేశ్వర్‌కు డాక్టరేట్ అందడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

చౌటుప్పల్‌లో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 12: పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ స్థలంలో డిపోను ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అధ్వర్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిశారు. అనేక మండలాలకు కూడలి ప్రాంతమైన చౌటుప్పల్‌లో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, ఇక్కడి నుంచి చుట్టు పక్కల మండలాల్లోని మారుమూల గ్రామాలకు సైతం బస్సులు తిరిగేందుకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. డిపోకు అవసరమైన స్థలం అందుబాటులో ఉందని, ఈ స్థలంలో పెట్రోల్ బంక్‌కు ఇచ్చిన లీజ్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్ స్టేషన్ కు ప్రహరీ గోడను వెంటనే పూర్తి చేయించాలని, ప్రస్తుత బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరారు. భక్తుల సౌకర్యార్థం నల్లగొండ నుంచి శ్రీశైలం, దేవరకొండ నుంచి యాదగిరి గుట్ట దేవస్థానాల వరకు బస్‌లను పునరుద్ధరించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు, ప్రధానంగా గిరిజన తండాలకు బస్సులను నడిపించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో బస్ స్టేషన్‌లను నిర్మించాలని, ఇప్పటికే ఉన్నటువంటి బస్ స్టేషన్‌లను మరమ్మతులు చేయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జ్ పబ్బు రాజు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ ఉన్నారు.



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గంధమల్ల ప్రాజెక్టును పూర్తి చేయాలి



ఆలేరులో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

ఆలేరు రూరల్/మోటకొండూరు, ఆగస్టు 12: గంధమల్ల ప్రాజెక్టును పూర్తి చేసి ఆలేరు ప్రాంతానికి సాగు, తాగు నీరందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. సోమవారం ఆలేరులో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు మారుతున్నా ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. నిపుణులతో కూడిన కమిటీని వేసి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 16న జిల్లా స్థాయి పార్టీ సమావేశాన్ని ఆలేరులో ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబ శివరావు, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చెక్క వెంకటేశ్, చౌడబోయిన కనకయ్య, ప్రవీణ్, అంజనేయులు ఉన్నారు.

● సీపీఐ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బొలగాని సత్యనారాయణ, యానాల దామోదర్‌రెడ్డి, రేగు సిద్దయ్య, మండల కార్యదర్శి మాణిక్యం పాల్గొన్నారు.

రాజాపేట: మండలానికి తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని అందించాలని, గంధమల్ల రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుర్ల లింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు జంగా అంజయ్య, నర్సింహులు, పుట్ట గణేష్, మూల పోచయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేసి, మండలానికి సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు కోరారు. మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, కె.సత్తయ్య, జె.దయాకర్‌రెడ్డి, బి.లాల్‌రెడ్డి, వై.బుచ్చిరెడ్డి, ఎస్.పురుషోత్తం, జి.రాజమణి, నయీమ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు అలవాటుపడొద్దు

మోత్కూరు, ఆగస్టు 12: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వారి భవిష్యత్ అంతటితో ముగిసినట్టేనని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల జీవితాలు బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆలోచనా శక్తి తగ్గి, ఆరోగ్యం దెబ్బతిని నిష్ప్రయోజకులుగా మిగిలి కన్నవారికి పుట్టెడు దుఃఖాన్ని కలిగించిన వారవుతారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి తాటి రాజు తల్లి అరుణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ సోమవారం మృతురాలి ఇంటికి వెళ్లి తమ విద్యార్థి రాజును, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.8 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో లెక్చరర్లు కడారు నర్సింహారెడ్డి, ఎం.సతీష్, ఎం.సుజాత, డి.మంజుల, కె.శ్వేత, కె.శ్యామ్, ఎ.హరికృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

చౌటుప్పల్: మండల కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై ఎం.లక్ష్మయ్య, వైద్యాధికారి సిహెచ్.కాటం రాజు, కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్‌రెడ్డి, విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, కూరేళ్ల నర్సింహాచారి పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్టీఆర్ఐ)లో వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్న యువతీ యువకులకు నిర్వహించిన సదస్సులో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్ఎస్ఆర్ లక్ష్మీ, ఏఎస్ఐ సైదిరెడ్డి పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో శ్రీ సరస్వతి జూనియర్ కళాశాల్లో సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ఐసీడీఎస్ కార్యకర్తలు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ సురేందర్, పాండు, పార్వతి, భాగ్యలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు: పట్టణంలో సాయినగర్‌కు చెందిన కొణతం నరేందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారుపోతుల వెంకట్, పురుగుల నర్సింహ, ఎండీ.సమీర్, జినుకల కనుకయ్య ఉన్నారు.

మోత్కూరు: మండలంలోని అనాజీపురం గ్రామానికి చెందిన జోగు నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె సహచర పూర్వ విద్యార్థులు విద్యార్థులు రూ.36 వేలు ఆమె కుమార్తె పేరున పోస్టాఫీసులో సుకన్య యోజన పథకంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బత్తిని ప్రవీణ్, అవనగంటి రాజు, ఉప్పల నాగరాజు, గుంటూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మండల కేంద్రానికి చెందిన వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పోచం సోమయ్యను ఘనంగా సన్మానించారు. సాగర్‌లో నిర్వహించిన క్యాట్కో సదస్సులో ఆయన్ను సత్కరించారు.

భువనగిరి టౌన్, భూదాన్‌పోచంపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా మాదిగల చి రకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోద ముద్ర వేసిందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, మందకృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ఇటికల దేవేందర్, బం డారు శివశంకర్, కొళ్ళ జహంగీర్, గాయపాక పృథ్వీరాజ్, బర్రె ర మేష్, ఆంజనేయులు, సురేంద్రప్రసాద్, శివ, పోచంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎ స్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బస్వయ్య, నాయకులు పెద్దల శ్రీనుమాదిగ, నర్సింగరావు, భిక్షపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): కేరళలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. వయనాడ్ ప్రాంత బాధితుల కోసం నిధులను సేకరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ నయూం, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, నాయకులు ముత్యాలు, సాయికుమార్, దేవేందర్, పంజాల వెంకటేశం, నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేట: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్ ఖానం అన్నారు. ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు లెక్చరర్ డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, గ్రంథాలయ సమాచార శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ శ్రీను, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, చినబాబు, సునీత, అనిత పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామంలోని సర్వేనంబర్ 424లోని 196 ఎకరాల భూమి చింతకుంట్ల కొండల్‌రెడ్డి, వారి వారసులకు ఇంతవరకు పట్టా లేదని మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య, ఆయన అనుచరులు తెలిపారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మండల యాదవ మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చినుకని మల్లేష్, ఉపాధ్యక్షులు ఎర్రసాని సతీష్, గజ్జి పాండు, ఈడ్డుల మస్తాన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మోటకొండూరు: మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన అయిలి గిరిధర్ కుటుంబాన్ని కుటుంబన్ని ఆదుకోవాలని బంధువులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

వైకల్యం చదువుకు అడ్డంకి కాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో ప్రశాంత్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఆగస్టు 12: వైకల్యం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదలతో చదివుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి డీఈవో ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని దివ్యాంగుల పిల్లల గుర్తింపు, అవసరమైన ఉపకరణాల అందజేతకు సోమవారం భువనగిరిలో తెలంగాణ సమగ్ర శిక్షా, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్తింపు శిబిరంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగ పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఉపకరణాలను అందించనున్నట్లు తెలిపారు. సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలోని 18 సంవత్సరాల వయస్సు లోపు 165 మంది విద్యార్థులు గుర్తింపు శిబిరానికి హాజరయ్యారు. త్వరలో ఉపకరణాలను అందించనున్నట్లు అధికారులు తెలిపారు. డాక్టర్ సునీత, డాక్టర్ సల్మాన్, డాక్టర్ మహేందర్, తదితర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గుర్తింపు శిబిరం జరిగింది.

స్వాతంత్ర్య సమరయోధురాలు లక్ష్మిని స్ఫూర్తిగా తీసుకోవాలి



సమరయోధురాలు లక్ష్మిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్

ఆలేరు రూరల్, ఆగస్టు 12: స్వాతంత్ర్య సమరయోధురాలు లక్ష్మిని స్ఫూర్తిగా తీసుకుని, నేటి యువత దేశ బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలేరులో మండలంలోని శారాజీపేట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు మంత్రి లక్ష్మి, కిష్టయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్యాషియర్ ఎండీ.యాకూబ్, మంత్రి లక్ష్మి కుమారుడు మంత్రి దేవేందర్, సన్ని, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన: ఎమ్మెల్యే



కాంగ్రెస్‌లోకి నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి రూరల్, ఆగస్టు 12: కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన, అభివృద్ధి సాధ్యపడుతుందని గమనించిన వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని నమాత్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రజాపాలన కొనసాగిస్తూ, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లంల శాలిని జంగయ్య, నాయకులు వెంకటేశ్ యాదవ్, సుర్పంగ వెంకటేశ్, బత్తిని సుధాకర్ గౌడ్, మట్ట బాలకృష్ణ, నరేశ్, జిట్టా అశోక్, ఎల్లంల నర్సింహయాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించేలా చూడాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సన్మానిస్తున్న మహేందర్ తదితరులు

మోత్కూరు, ఆగస్టు 12: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ సమావేశాలు ప్రతీ మూడు మాసాలకోసారి నిర్వహించేలా చూడాలని కోరుతూ మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ జిల్లా కమిటి సభ్యుడు దాసరి తిరుమలేష్ సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జిల్లా శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. తొలుత వారికి శాలువలు కప్పి సన్మానించి సమస్యలపై వినతి పత్రం అందించారు. 2023 జూలై 25 తర్వాత జిల్లాలో సమీక్షా సమావేశాలు జరుగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు, బాధితులకు అందాల్సిన సహాయం, పునరావాసం వివరాలు తెలియడం లేదన్నారు.

ట్రాన్స్‌పోర్టు కార్మికులకు అపరాధ రుసుం విధించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

భువనగిరి అర్బన్, ఆగస్టు 12: ట్రాన్స్‌పోర్టు కార్మికులకు అపరాధ రుసుం విధించే సెక్షన్‌ను రద్దు చేయాలని సీఐటీయూ-ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ కలకత్తాలో సోమవారం జరిగిన ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ జాతీయ కమిటీ సమావేశంలో తెలంగాణ తరపున రిపోర్టు ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులపై రూ.7లక్షల అపరాద రుసుం వేసే బీఎన్ఎస్ 106(1)(2)ను తక్షణమే రద్దు పర్చాలన్నారు. రవాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విస్‌రావు, శీకాంత్, ఉపేందర్, అజయ్‌బాబు, విక్రమ్ పాల్గొన్నారు.

రేకులషెడ్లను తొలగించిన పరిశ్రమల శాఖ అధికారులు

భువనగిరి టౌన్, ఆగస్టు 12: పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో పారిశ్రామిక వాడకు ఆనుకుని నిర్మించిన రేకుల షెడ్లను పరిశ్రమలశాఖ అధికారులు సోమవారం తెల్లవారుజామున తొలగించారు. రేణుక ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు మొక్కులుగా సమర్పించుకునే మేకలను తాత్కాలికంగా నిర్మించిన షెడ్ల కింద ఆరెకటికలు వధిస్తూ జీవనం సాగిస్తున్నారు. కానీ జంతుబలితో పరసరాల పరిశుభ్రత దెబ్బతింటూ పారిశ్రామిక వాడకు ఇబ్బందిగా మారిందంటూ అధికారులు ఆకస్మాత్తుగా షెడ్లను తొలగించారు. దీంతో షెడ్ల తొలగింపుతో తాము ఉపాధి కోల్పోయామంటూ ఆరెకటికలు బైపాస్ రోడ్డుపై నిరసన తెలిపారు. ఆరకటికల సంఘం గౌరవ అధ్యక్షుడు తంగేళ్లపల్లి రవికుమార్, అధ్యక్షుడు హీరెకార్ శ్రీనివాస్, గట్కారి శ్రీకాంత్ ఆందోళనలో పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత, సమైక్యతలను పెంపొందించాలి



భువనగిరిలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

భువనగిరి టౌన్/చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 12: జాతీయ సమగ్రత, సమైక్యతను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం భువనగిరిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశ వ్యతిరేక కార్యక్రమాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వాతంత్ర సమరయోధులను స్మరిస్తూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి అన్నారు. ముందుగా పట్టణంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పట్నం కపిల్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, చందా మహేందర్ గుప్తా, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, కె మల్లిఖార్జున్, కందారి శ్రీధర్, బట్టు క్రాంతి, నాగు నరేష్ పాల్గొన్నారు.

● మహిళా మోర్చా ఆధ్వర్యంలో టుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై త్రివర్ణ పతాకాలను పట్టుకొని బైక్ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు మాధురి చంద్ర, నాయకులు రేవల్లి స్వప్న, ఊడుగు విజయలక్ష్మి, లక్ష్మి, రేఖ, మాధవి, రాణి, దీపిక, సురేఖ, కల్పన, నీరజ, లాస్య, కీర్తి, రమ్య పాల్గొన్నారు.